క్లుప్తంగా

28 నుంచి వాలీబాల్ పోటీలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఈ నెల 28 నుంచి మార్చి 3 వరకు నిర్వహించనున్నట్లు సీఐ అశోక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ములకపాడు వైద్యశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దుమ్ముగూడెం మండలానికి చెందిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. టీమ్‌లో ఆడే క్రీడాకారులు ఒకే గ్రామానికి చెందినవారై ఉండాలని, ఒక టీమ్‌లో ఆడిన క్రీడాకారుడు మరో టీమ్‌లో ఆడే అవకాశం లేదని వెల్లడించారు. విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేయనున్నట్లు, ఒక్క లీగ్ మ్యాచ్ గెలిచినా వారికి నెట్ వాలీబాల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. ఫైనల్ చేరిన టీమ్‌లకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ లోపు ఎంట్రీలను నమోదు చేసుకోవాలని, ఎంట్రీల కోసం 8008865351, 9704190229, 9640410072 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

మార్చి 9న పద్మశాలి మహాసభలు



మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చర్ల: మార్చి9న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబీషన్ గ్రౌండ్‌లో జరిగే 17వ అఖిల భారత పద్మశాలీ మహాసభలకు పద్మశాలీలు వెలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్ల రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఆదివారం చర్లలో ఈర్ని కృష్ణమోహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసం పద్మశాలీలంతా ఐక్యం కవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు శెట్టి సాంబశివరావు, దొడ్డి తాతారావు, దొడ్డి సూరిబాబు, ఇమ్మంది ఉదయ్‌కుమార్, ఎర్రగుంట్ల రాజలింగం, వల్లాల రాజలింగు, బొజ్జా తాతారావు, నీలి ప్రసాద్, సీహెచ్ రామకృష్ణ, వలసా కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి ఘన నివాళి



స్తూపం వద్ద జెండా ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

అశ్వారావుపేటరూరల్: పట్టణ కేంద్రంలోని దొంతికుంటకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు బద్దె రాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ నాయకులు ఎస్‌డి.సలీం ఆధ్వర్యంలో స్తూపం వద్ద జెండా ఆవిష్కరించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాములు మృతి పార్టీకి తీరని లోటు అని, తుది శ్వాస వరకు పార్టీ కోసం శ్రమించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్నిన రామకృష్ణ, పఠాన్ జలాల్ ఖాన్, అబ్బాస్, పీ చెన్నారావు, బద్దె శ్రీను, ఉప్పతల వెంకటేశ్వరరావు, నూకవరపు విజయ్‌కాంత్, పి.రోహిణి, పిల్లి దుర్గ పాల్గొన్నారు.

మంత్రి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: శేషగిరినగర్‌కి చెందిన బండారు సతీష్ తండ్రి వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హాజరై ఆయన చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. కాగా బండారు సతీష్ మంత్రి వ్యక్తిగత సహాయకులుగా ఉన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, గాండ్ల సురేశ్, దొడ్డపనేని మధు, గుడిపూడి కోటేశ్వరరావు, రవి, నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు.

చిక్కిన చికెన్ మార్కెట్

- బర్డ్ ఫ్లూతో తగ్గిన వ్యాపారాలు
- చేపలు, మటన్‌కు గిరాకీ



వినియోగదారులతో కళకళలాడుతున్న మటన్ దుకాణాలు



వ్యాపారం లేక వెలవెలబోతున్న చికెన్ దుకాణాలు



చేపల దుకాణం వద్ద కొనుగోలుకు వేచిచూస్తున్న వినియోగదారులు

భద్రాచలంఅర్బన్: బర్డ్ ఫ్లూ కారణంగా భద్రాచలం పట్టణంలోని చికెన్ వ్యాపారాలు పడిపోయాయి. ఆదివారం వస్తే చాలు కిటకిటలాడే చికెన్ దుకాణాలు.. ఇప్పుడు జనాలు లేక బోసిపోతున్నాయి. బాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడం వల్ల జిల్లాలో అధికార యంత్రాంగం ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడంతో ప్రజలు చికెన్ వైపు వెళ్లడంలేదు. చేపలు, కొంచెం ఎక్కువే అయినా మటన్ వైపు వెళ్తున్నారు. దీంతో చికెన్ వ్యాపారులు బేరాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పనిచేసే వాళ్లకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నారు.

ధరలు పెరిగే సమయంలో..

వాస్తవంగా చికెన్‌కు చక్కటి ధర పలికే సీజన్ ఇది. ప్రతి ఏటా ఎండలు ప్రారంభమయ్యే సమయంలో ధరలు పెరుగుతుంటాయి. కిలో రూ.250 నుంచి చికెన్ రూ.350 వరకు ఈ సీజన్‌లో ధర పలుకుతుంది. బర్డ్ ఫ్లూ కారణంగా ధరల పెరుగుదల మాట దేవుడెరుగు కనీసం వ్యాపారాలు కూడా సాగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న కొత్త మార్కెట్లో అన్ని చికెన్ దుకాణాల్లో ప్రతి ఆదివారం పెద్ద ఎత్తున కోడి మాంసం విక్రయాలు జరుగుతాయి. బర్డ్ ఫ్లూ కారణంగా ఇప్పుడు భద్రాచలం పట్టణంలో వివిధ కాలనీలతో పాటు మార్కెట్ ప్రాంతాల్లోని చికెన్ దుకాణాలన్నీ వెలవెలపోతున్నాయి.

చేపలు, మటన్ ధరలు పైపైకి..

కోడి మాంసం అమ్మకాలు తగ్గడంతో మేక మాంసం, చేపల విక్రయాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో మటన్ వ్యాపారులు కిలో రూ.800 నుంచి రూ. 900 వరకు పెంచేశారు. అయినప్పటికీ వినియోగదారులు వెనక్కి తగ్గడంలేదు. చేపల ధరలు కూడా పెరిగిపోయాయి, రూ.50 పెడితే ఒకపూట కూరకు వచ్చే చేపలు ఇప్పుడు రూ.100 పెట్టినా రావడంలేదని వినియోగదారులు చెబుతున్నారు.

వదంతులు నమ్మొద్దు..



బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ తినకూడదని.. తినొచ్చని రకరకాల వదంతులు వ్యాపిస్తున్నాయి. వాటిని నమ్మకూడదు. ఉడికించి తినడం వల్ల బర్డ్ ఫ్లూ రాదని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి 100 డిగ్రీల సెల్సియస్‌లో దేనినైనా ఉడికించి తినడం వల్ల వైరస్ చనిపోతుంది. వ్యాపారస్తులు కూడా తగు జాగ్రత్తలు తీసుకుని విక్రయిస్తే మేలు.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

అప్పుల పాలైపోయాం..



వ్యాపారులు ముందుగా కోళ్లు తీసుకొచ్చి దుకాణాల ముందు దించి వెళ్తారు. అమ్మకాల తర్వాత నాటి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈసారి తీసుకొచ్చి ఇచ్చిన కోళ్లు అలాగే ఉండిపోయాయి. వ్యాపారం లేకపోయినా వాటికి డబ్బు చెల్లించక తప్పదు. బర్డ్ ఫ్లూ వల్ల చికెన్ వ్యాపారులమంతా నష్టపోయాం. ఎంతోకొంత బేరం ఉంటేనే బిజినెస్‌లో ఏదైనా రొటేషన్ చేయగలం. పూర్తిగా వ్యాపారం లేకపోతే ఏమీ చేయలేం.

– శ్రీనివాసరావు, చికెన్ వ్యాపారి, భద్రాచలం

ఆధ్యాత్మిక స్ఫూర్తిని కొనసాగించాలి

బూర్గంపాడు: గురు హరినాథ్ విఠల్ ఆధ్యాత్మిక స్ఫూర్తిని ఆయన శిష్యబృందం కొనసాగించాలని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడులోని శ్రీరామా అవధూత ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో ఆదివారం గురు హరినాథ్ విఠల్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్ల క్రితం బూర్గంపాడులో శ్రీరామా అవధూత ఆశ్రమాన్ని నిర్మించి వందలాదిమంది శిష్యబృందంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక సేవ కార్యక్రమాలను ఆధ్యాత్మిక వేత్త విఠల్ గురు నిర్వహించారని అన్నారు. ఆయన మరణానంతరం కూడా దేశవిదేశాల్లో ఆయన శిష్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనసాగిస్తూ భక్తిభావాలను పెంపొందిస్తున్నారని వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో ప్రజలను ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహక ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



గురు హరినాథ్ విఠల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులు

విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం



సాయి చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

మణుగూరురూరల్: సాయినగర్‌లోని షిర్డీ సాయి బాబా ఆలయ విగ్రహ ప్రతిష్ఠ 31వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడహారతితో ప్రారంభమైన పూజలు.. అష్టోత్తర కలశాలతో పాలాభిషేకం, పుష్పాలతో అలంకరణ, సామూహిక సాయి చాలీసా, హారతి, సామూహిక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ధూప్ హారతి, పల్లకీ సేవ, పవళింపు సేవతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాకు పూజలు నిర్వహించారు. సాయి నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా.. భక్తులకు ఆలయ పూజారి తీర్థప్రసాదాలు అందజేశారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రభంజనం

భద్రాచలంఅర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఆదివారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఆర్కిటిక్ విభాగ ఫలితాల్లో భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల విద్యార్థిని శ్రీ భవ్య 96.70 శాతం సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, మాగంటి రమేష్ బాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభ నిర్వహించారు. శ్రీ భవ్య విజయానికి తోడ్పాటు అందించిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థిని తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమాలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలోని కుర్వాపల్లి కొత్తూరు గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మామిళ్లవాయి గ్రామానికి చెందిన పూనెం సతీష్ సున్నం వినయ్ బైక్ వెళ్తుండగా కుర్వాపల్లి కొత్తూరు వద్ద బైక్ అదుపు తప్పి బండరాయిని ఢీకొని కిందపడ్డారు. ప్రమాదంలో సతీష్‌కు రెండు కాళ్లు విరగగా, వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని 108లో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

దమ్మపేట: మండల కేంద్రంలో ఉన్న విజన్ సెంటర్‌లో లయన్స్ క్లబ్, వైరా వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ క్యాంప్ చైర్మన్ దారా యుగంధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దమ్మపేటలో ఈ నెల 25న (మంగళవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న వైద్య శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని రకాల పరీక్షలను ఉచితంగా చేస్తారని అన్నారు. శిబిరాన్ని మండల, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అండగా ఉంటాం..

దుమ్ముగూడెం: గుండె సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందెందుకు వెళ్తున్న బీఆర్ఎస్ మండల కోకన్వీనర్ యండి.జానీపాషా భార్య గజలక్ష్మిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

ఊపందుకున్న మట్టికుండల కొనుగోళ్లు

భద్రాచలంఅర్బన్: మార్చి రానేలేదు.. రోజు రోజుకూ ఎండల ప్రభావం పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో దాహం తీర్చే చల్లని నీటికి కోసం ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇళ్లల్లో ఫ్రిడ్జ్ ఉన్న ఆరోగ్య సమస్యలు రాకుండా కుండ నీటిని తాగే వారు చాలా మందే ఉన్నారు. పేదోడి ఫ్రిడ్జ్‌లో పేరొందిన మట్టి కుండలు మార్కెట్లోకి అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ఆయా ఆకృతుల్లో మార్కెట్ లోకి వచ్చేశాయి. ఒక్కొక్కటి పరిమాణాన్ని బట్టి రూ.200 నుంచి రూ.400 వరకు ధర పలుకుతున్నాయి.



భద్రాచలం పట్టణంలోని పాత మార్కెట్ వద్ద మట్టికుండలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

అసత్య ఆరోపణలకు ఖండన

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలోని శ్రీరామ కాటన్ ఇండస్ట్రీ గురించి కొందరు అవగాహన లేని వ్యక్తులు చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తున్నామని జిన్నింగ్ మిల్లు యాజమాన్యం వారు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ చేసి ఇవ్వడానికి కాటన్ ఇండస్ట్రీకి అప్పగిస్తారని, సీసీఐ నియమ నిబంధనల ప్రకారం తమకు ఇచ్చిన పత్తిని జిన్నింగ్ చేసి బేల్లుగా మార్చి సీసీఐ వారికి అప్పగించడం మాత్రమే తమ బాధ్యత అని వివరించారు.

రైతుల వద్ద పత్తి కొనుగోలు చేయడం, రైతులకు డబ్బులు చెల్లించడం, టీఆర్‌లు జారీ చేయడం కాటన్ ఇండస్ట్రీకి సంబంధం లేని విషయమని స్పష్టం చేశారు. ఈ వాస్తవం తెలియని కొందరు అవగాహన లేని వ్యక్తులు కాటన్ ఇండస్ట్రీపైన అసత్య ఆరోపణలు చేయడంపై విచారణ వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో కాటన్ మిల్లు ఉండటం వల్ల గత మూడు సంవత్సరాలుగా పత్తి పండించే రైతులకు సరైన గిట్టుబాటు ధర లభిస్తుందనే వాస్తవాన్ని గ్రహించాలని హితవు పలికారు. ఎలాంటి విచారణకైనా యాజమాన్యం సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఇకపై కాటన్ ఇండస్ట్రీ పైన అసత్య ఆరోపణలు చేస్తే అలాంటి వ్యక్తులపై యాజమాన్యం చట్ట పరమైన చర్యలు తీసుకుంటుందని యాజమాన్యం వారు తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మణుగూరుటౌన్: కొత్తగూడెంలో నిర్వహించిన తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2025లో మణుగూరు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంజేపీటీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు సీనియర్ మహిళా కరాటే మాస్టర్ కాశిమల్ల పద్మ తెలిపారు. తొర్లుకుంట మునేశ్వరి 14 సంవత్సరాల బాలికల కటా విభాగంలో బంగారు పతకం, వాంకుడోత్ దీక్షిత 16 సంవత్సరాల బాలికల కటా విభాగంలో బంగారు పతకం, వంకాయల వర్షిత 10 సంవత్సరాల కటా విభాగంలో వెండి పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కరాటే జనరల్ సెక్రటరీ ఇందిరాల శ్రీధర్, ప్రెసిడెంట్ వాసు, ప్రణీత్, రాధిక తదితరులు అభినందించారు.



పతకాలు సాధించిన కరాటే విద్యార్థులు

తవ్విన రోడ్డుతో వాహనదారులకు ఇక్కట్లు



బీటీ రోడ్డు పక్కన తవ్వి, సూచిక బోర్డులు లేకుండా వదిలేసిన దృశ్యం

ములకలపల్లి: ఏడాదిన్నర క్రితం ప్రారంభించిన ములకలపల్లి సెంట్రల్ లైటింగ్ పనులు ఆగుతూ.. సాగుతూ ఉన్నాయి. కొద్దిరోజుల విరామం అనంతరం నిర్మాణ పనులు మరలా ఆరంభించారు. ఫోర్ లైన్ బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డుకు ఓ పక్క భూమిని తవ్వారు. అడుగున్నర లోతు, నాలుగున్నర మీటర్ల వెడల్పుతో మట్టి తోవ్వేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా. తవ్విన రోడ్డు పక్కన ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. కనీసం డెంజర్ సింబల్ తెలిపే రిబ్బర్లు కూడా ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు కట్టలేదు. ఈ క్రమంలో రాత్రివేళల్లో చీకటి, వేకువ జామున మంచు కురుస్తున్న సమయంలో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'సెంటిమెంట్‌తో కాలం గడుపుతున్నారు..'



మాట్లాడుతున్న కట్రం స్వామి

ములకలపల్లి: బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సెంటిమెంట్‌తో కాలం వెళ్లదీస్తున్నారని టీడీపీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి ఆరోపించారు. ములకలపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాభిమానం కోల్పోయి ప్రతిపక్షం కూర్చున్న మాజీ సీఎం కేసీఆర్, ఆంధ్రా సీఎం చంద్రబాబు నాయుడిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీని ఏమీ అనలేక పక్క రాష్ట్రంలో పాలన సాగిస్తున్న టీడీపీపై అవాకులు చవాకులు పేల్చడం సరికాదని హితువు పలికారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరోమారు టీడీపీ చేతితో చావుదెబ్బ తినక తప్పదని హెచ్చరించారు. సీనియర్ నాయకులు తేళ్ల చెన్నయ్య, బత్తుల సీతారాములు పాల్గొన్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్టూ..



తాటిగూడెంలో కనుచూపు మేర పచ్చని పొలాలు

దూరంగా చెట్లు, కొండలు కనిపిస్తూ ప్రకృతి అందాన్ని మరింత పెంచుతున్న ఈ చిత్రం చూస్తుంటే.. భూమికి పచ్చని రంగేసినట్లు అనిపిస్తోంది కదా!.యాసంగి సాగులో భాగంగా కరకగూడెం మండలంలోని తాటిగూడెం గ్రామంలో ఓ రైతు సాగు చేస్తున్న ఈ వరి పొలం ఇది. అటువైపుగా వెళ్తున్న వారు పచ్చని పొలాలను చూసి పరవశిస్తున్నారు. ఆదివారం 'సాక్షి' తన కెమెరాలో ఈ దృశ్యాన్ని బంధించింది.

– కరకగూడెం

పల్లెల్లో గ్రాసం ప్రియం

- మేత కోసం అల్లాడుతున్న మూగజీవాలు
- భగ్గుమంటున్న గడ్డి ధరలు
- కానరాని పశువుల నీటితొట్లు



మేత కోసం పాకులాడుతున్న పశువులు

కరకగూడెం: వేసవి రాకముందే ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే చెరువులు ఎండిపోయాయి. పశువులకు నీరు దొరకడం గగనమైపోయింది. అడవుల్లో మేత కరువైంది. రైతులు గ్రాసం కోసం వెతుకులాడుతున్నారు. కొందామంటే గడ్డి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో పాడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

మేత కోసం వెతలు..

మండల వ్యాప్తంగా మేత కోసం మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఒక వైపు గడ్డి ధరలు భగ్గుమంటున్నాయి. గడ్డి ధరలు ఒక్కో కట్టకు రూ.30 నుంచి రూ.50 వరకు ఉంది. తొలకరి వరకూ ఇదే పరిస్థితి అయితే వర్షాకాలంలో నీటి వనరులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గ్రాసం కొరత తక్కువే కాని వేసవిలో మాత్రం గడ్డి లభించకపోవడంతో పశువులు బక్క చిక్కిపోతాయి. దీంతో ఇటు అమ్ముకోలేక సాకలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో వరి సాగు ఎక్కువే. గడ్డిని సక్రమంగా వినియోగించుకుంటే గ్రాసం సమస్య ఉండదు. కానీ ప్రస్తుతం వరి కోత ఎక్కువగా మిషన్ల ద్వారా చేపడుతున్నారు. దీంతో గడ్డి వృథా అవుతోంది. కొన్నిచోట్ల అలాంటి గడ్డిని సైతం బేరల్ యంత్రం ద్వార కట్టలుగా కడుతూ వినియోగించుకుంటున్నారు. అలాంటి దాన్ని సొంత పశువులకు మాత్రమే వినియోగించుకుంటున్నారు. ఒక్కో కట్ట రూ.20 నుంచి రూ.30 వరకూ పలుకుతున్నా బయట విక్రయించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో సాధారణ రైతులు గ్రాసం కోసం వెంపర్లాడాల్సి వస్తోంది.

తాగునీటికీ విలవిల..

ఒక వైపు తరుముకొచ్చిన వేసవి మరోవైపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు, పాడి రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి ప్రకోపించినట్లుంది ఫలితం వాగులు, వంకలు, కుంటలు ఎండిపోయాయి. కొన్ని చెరువులు చుక్క నీరు లేక బోసిపోయాయి. పచ్చని మైదానాలు బీళ్లువారాయి, పచ్చదనం కనుమరుగైంది. దీంతో గొంతు తడుపుకోవడానికి చుక్కనీరు లేక మూగ జీవాలు విలవిలలాడుతున్నాయి. వాటిని చూసి అన్నదాత తల్లడిల్లుతున్నాడు.తద్వారా పాడి పశుపోషణ భారమై పోతోంది. తట్టుకోలేక కబేళాలకు లేదా సంతలో అమ్మాల్సిన దుస్థితి నెలకొంది.